పది పరీక్షల ఏర్పాట్లపై పరిశీలన

కేశంపేటలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో చంద్రశేఖర్

కేశంపేట, మార్చి 15 : ప్రభుత్వం ఈ నెల 21నుంచి ప్రారంభించబోయే పదో తరగతి పరీక్షల ఏర్పాట్లను శనివారం ఎంఈవో చంద్రశేఖర్ పరిశీలించారు. కేశంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వశిష్ఠ పాఠశాలతో పాటు కొత్తపేట జెడ్పీహెచ్ఎస్‌లను తనిఖీ చేశారు. పరీక్షలకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలను అందజేశారు. కేశంపేట జెడ్పీహెచ్ఎస్‌లో 190, వశిష్ఠ పాఠశాలలో 178, కొత్తపేట జెడ్పీహెచ్ఎస్‌లో 180 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో మంచినీటి వసతితోపాటు ప్రథమ చికిత్సకు అవసరమైన కిట్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం ఆయా పాఠశాలల్లోని 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడి ఎలాంటి మానసిక ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎం విద్యావతి, సీఆర్పీ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చీకటైతే.. అంతే!

- మందుబాబులకు అడ్డాగా మారిన హాస్టల్ భవనం
- అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా బీసీ వసతి గృహం
- విద్యార్థులు తక్కువగా ఉన్నారని మూసివేత

కేశంపేటలోని బీసీ వసతి గృహం

కేశంపేట, మార్చి 15 : ఒకప్పుడు ఎంతో మంది నిరుపేద విద్యార్థుల ఆకలి దప్పికలు తీర్చడంతో పాటు సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన కేశంపేట బీసీ వసతిగృహం నేడు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో వసతి గృహాన్ని అధికారులు మూసి వేయడంతో మందు బాబులకు అడ్డాగా మారింది. రోజు సాయంత్రమైతే చాలు మద్యం సీసాలతో మందు బాబులు వసతి గృహానికి వెళ్లి మద్యాన్ని సేవిస్తున్నారని, మరికాస్త చీకటైతే కొందరు వసతి గృహంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న బీసీ వసతి గృహాన్ని ప్రభుత్వ కార్యాలయాల కోసం లేదా యువతకు ఉపాధి కల్పించేందుకు కావాల్సిన శిక్షణ ఇచ్చేందుకు (స్కిల్ డెవలప్ మెంట్) కేంద్రంగా ఉపయోగించుకుంటే బాగుంటుందని స్థానికులు అంటున్నారు. బీసీ వసతి గృహాన్ని స్కిల్ డెవలప్ మెంట్ కేంద్రంగా తీర్చిదిద్దితే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు సైతం మెరుగు పరిచిన వారవుతారని, ప్రభుత్వం, అధికారులు ఆ దిశగా అడుగులు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

వెనుకబడిన వర్గాలన్నీ ఏకమైతేనే రాజ్యాధికారం

కేశంపేటలో కాన్షీరాం చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న ధర్మ సమాజ్ పార్టీ నేతలు

కేశంపేట, మార్చి 15 : సమాజంలో అడుగడుగున అవమానాలు, అణచివేతను ఎదుర్కొంటున్న వెనకబడిన వర్గాలన్నీ ఏకమై బహుజన మార్గదర్శి కాన్షీరాం స్ఫూర్తితో రాజ్యాధికారాన్ని సాధించే దిశగా అడుగులు వేయాలని ధర్మ సమాజ్ పార్టీ కేశంపేట మండల అధ్యక్షుడు మహిపాల్ పిలుపునిచ్చారు. కాన్షీరాం జయంతి సందర్భంగా కేశంపేటలో ఆయన చిత్రపటానికి శనివారం డీఎస్పీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల కోసం కాన్షీరాం తీసుకొచ్చిన సంస్కరణలు యావత్ దేశానికే ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ నేతలు మల్లేశ్, శివ, రవి, ఆనంద్, విష్ణు, కృష్ణ, శ్రీకాంత్, పురుషోత్తం, నరేశ్, భాస్కర్, ప్రవీణ్, విక్రం తదితరులు పాల్గొన్నారు.

బహుజన బాంధవుడు కాన్షీరాం

ఆమనగల్లు : బహుజన బాంధవుడు కాన్షీరాం అని డీఎస్పీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు వంకేశ్వరం రమేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ ఆవరణలో కాన్షీరామ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన కాన్షీరాం చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ, వస్పుల బలరాం, పోలే హరి, మహేశ్, జంతుక సురేశ్, జంతుక యాదగిరి, మహేశ్, జంగయ్య, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు : కాన్షీరాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఎస్పీ నాయకులు

ఏఐతో ఎంతో ఉపయోగం

తంగడిపల్లి ప్రాథమిక పాఠశాలలో మాట్లాడుతున్న చేవెళ్ల ఎంఈవో పురందాస్

చేవెళ్ల రూరల్, మార్చి 15 : విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించడానికి 'ఏఐ' ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాల విద్యాధికారులు పురందాస్, సయ్యద్ అక్బర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే కార్యక్రమంలో భాగంగా ఏఐ కార్యక్రమాలు పైలట్ ప్రాజెక్ట్ కింద చేవెళ్ల మండల పరిధి తంగడిపల్లి, శంకర్‌పల్లి మండల పరిధి టంగటూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంపిక చేశారు. శనివారం రెండు పాఠశాలల్లో కృత్రిమ మేధో సంపత్తి కార్యక్రమాలను ఎంఈవోలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ కింద మన పాఠశాలలు ఎంపిక కావడం హర్షణీయమన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు జీవన జ్యోతి, టంగటూరు హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సుసాల్ విల్సన్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆరిఫ్, తండగపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్, పీఆర్టీయూ చేవెళ్ల మండల అధ్యక్షుడు దయానందం, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, టంగటూరు అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సునంద, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ఇబ్రహీంపట్నం, మార్చి 15 : ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించేంత వరకు ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదని ఎమ్మార్పీఎస్ నాయకుడు కాళ్ల జంగయ్య అన్నారు. ఇబ్రహీంపట్నంలో శనివారం రిలే నిరాహార దీక్షను ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడు తూ.. ఆగస్టులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పున కు సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఎస్సీ వర్గీక రణకు పూర్తి మద్దతునిస్తూ ఉద్యోగాల నోటిఫి కేసన్లల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు మాట మార్చడం ఎంతవరకు సమంజసమన్నారు. వెంటనే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లుకు ఆమోదం తెలపాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నరేందర్, యాదయ్య, అశోక్, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కడ్తాల్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో కూర్చున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వర్గీకరణ తర్వాతే నియామకాలు చేపట్టాలి

కడ్తాల్, మార్చి 15 :ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన తర్వాతే ఉద్యోగ నియామలను చేపట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ తర్వాత ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ, తలకొండపల్లి మండల కేంద్రంలో ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం చేపట్టిన దీక్షలో మీసాల బాలస్వామి, రాములు, నర్సింహ, శివ, పెంటయ్య, ప్రదీప్, మహేశ్, శంకరయ్య, జగన్ కూర్చున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ మాదిగ, పూలే-అంబేద్కర్ జాతర కమిటీ అధ్యక్షుడు సుధాకర్ మాట్లాడుతూ మాదిగలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని తెలిపారు. రిలే నిరాహార దీక్షకు పీఏసీఎస్ డైరెక్టర్ శేఖర్‌యాదవ్, వెంకటయ్య, మహేశ్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతయ్య, మాజీ మండలాధ్యక్షుడు కుమార్, వీహెచ్‌పీఎస్ మండలాధ్యక్షుడు నారాయణ, బీఆర్ఎస్ నాయకులు సంపత్, మహేశ్, శేఖర్, సురేశ్, జంగయ్య, శ్రీశైలం, గిరి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీ బాధితులకు నిత్యావసరాల పంపిణీ

లెప్రసీ బాధితులకు సరుకులు పంపిణీ చేస్తున్న అభికారులు, ట్రస్టు ప్రతినిధులు

పెద్దఅంబర్‌పేట, మార్చి 15 : లెప్రసీ బాధితులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ రవీందర్‌రెడ్డి అన్నారు. రిలయబుల్ ట్రస్ట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శనివారం మున్సిపాలిటీ పరిధిలలోని పెద్దఅంబర్‌పేట శాంతినగర్‌లోని హిందూ మిత్ర యువజన సంఘంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదుల సంఖ్యలో లెప్రసీ బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ (లెప్రసీ) జాయింట్ డైరెక్టర్ జాన్‌బాబు, ట్రస్ట్ డైరెక్టర్ రవి, మాజీ కౌన్సిలర్ విద్యావతి విజయేందర్‌రెడ్డితో కలిసి రవీందర్‌రెడ్డి కుష్ఠు వ్యాధిగ్రస్తులకు సరుకులు అందజేశారు. లెప్రసీ బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీఎస్ స్లాప్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం రమేశ్, హిందూమిత్ర సంఘం అధ్యక్షుడు రాజు, రఘు తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ఇంటర్ పరీక్షలు

కేశంపేట, మార్చి 15 : మండల పరిధి లోని కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ పరీ క్షలు శనివారం సజావుగా సాగాయి. జేపీ దర్గా ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలతో పాటు పాటిగడ్డ కేజీబీవీ, కొత్తపేట ప్ర భుత్వ జూనియర్ కళాశాలలకు చెంది న విద్యార్థులు 85మంది పరీక్షలు రాయాల్సి ఉండగా ఇద్దరు గైర్హాజరయ్యారని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ మల్లేశ్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీ య ఘటనలు చోటు చేసుకోకుండా కేశంపేట పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు

తుర్కయాంజాల్, మార్చి 15 : మున్సి పాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని కమిషనర్ అమరేందర్‌రెడ్డి తెలిపారు. మున్సిపల్ పరిధిలోని ఇంజాపూర్ నుంచి తొర్రూర్ వెళ్లే రోడ్డులో చేపడుతున్న అక్రమ నిర్మాణ పనులను శనివారం కమిషనర్ ఆదేశాల మేరకు అధికారులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

ఆమనగల్లు, మార్చి 15 : ఆమనగల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఆమనగల్లు ప్రభుత్వ దవాఖాన ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి, పీఆర్‌వో పాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి శుక్లాలు, కంటి చూపు మందగించిన వారు, కంటి సమస్యలు ఉన్న వారందరూ ఆధార్‌కార్డు, రేషన్ కార్డు తీసుకుని కంటి వైద్య శిబిరానికి హాజరు కావాలని వారు సూచించారు.

ఆర్థిక ఇబ్బందులతో వలస కూలీ ఆత్మహత్య

మొయినాబాద్, మార్చి 15 : బతుకు దెరువు కోసం వచ్చిన వలస కూలీ ఆర్థిక ఇబ్బందులు... అనారోగ్యం కారణంగా ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. అస్సాం రాష్ట్రానికి చెందిన ప్రవత్ రావా, బిక్రం రాబ (27) బతుకుదెరువు కోసం మొయినాబాద్ మండల పరిధిలోని బాకారం గ్రామం రెవెన్యూలో ఉన్న డ్రీమ్ వాల్యూ రిసార్టులో నివాసం ఉంటూ కూలీగా పని చేస్తున్నారు. ప్రతి రోజు మాదిరిగానే పని చేసి శుక్రవారం రాత్రి పడుకున్నారు. శనివారం ఉదయం 6 గంటల సమయంలో ప్రవత్ రావా నిద్ర నుంచి లేచి చూడగా బిక్రం రాబ కనిపించలేదు. చుట్టుపక్కల వెతకడంతో పక్క రూమ్‌లో టవల్‌తో ఉరి వేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకుని ఉంటాడని ప్రవత్ రావా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సీసీ రోడ్లు వేయండి సారూ..

- నల్లచెరువులోని ఎస్సీ కాలనీలో రోడ్ల నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు
- పట్టించుకోని అధికారులు

అండర్ డ్రైనేజీ చేసి మట్టి పోయకుండా వదిలేసిన దృశం

మాడ్గుల, మార్చి 15 : మండల పరిధిలోని నల్లచెరువు గ్రామంలోని ఎస్సీ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరయ్యాయి. గ్రామ పంచాయతీ తీర్మానం చేసింది. ఇప్పటివరకు సీసీ రోడ్డు పనులు ప్రారంభించకపోవడంపై కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏడాదిన్నర క్రితం అండర్ డ్రైనేజీ పనులు చేపట్టారు. మట్టి పోయకుండా అలాగే వదిలేశారు. ఇప్పుడు సీసీ రోడ్లు వేయకుండా అలసత్వం ప్రదర్శిస్తున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రాకపోకలకు ఇబ్బందిగా ఉంది

చాలా రోజుల క్రితం అండర్ డ్రైనేజ్ వేసి వదిలేశారు. ద్విచక్ర వాహనాలు పోవడానికి ఇబ్బందిగా ఉంది. చిన్నపిల్లలు, వృద్ధులకు నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి చొరవ చూపి సీసీ రోడ్డు వేసేలా చూడాలి.

- కట్ట మహేశ్, నల్లచెరువు, మాడ్గుల మండలం

సమస్యను పరిష్కరించాలి

కాలనీలో అండర్ డ్రైనేజీ పనులు చేసి మట్టి పోయకుండా వదిలేశారు. రాత్రి వేళల్లో నడవాలంటే ఎక్కడ కింద పడిపోతామని అని భయమేస్తున్నది. ఎవరూ పట్టించుకోవడం లేదు. సీసీ రోడ్డు వేసి కాలనీ వాసుల సమస్యను పరిష్కరించాలి.

- కట్ట జంగయ్య, నల్లెరువు, మాడ్గుల మండలం

బైక్ దొంగ పట్టివేత

హజీ (నిందితుడు)

ఆమనగల్లు, మార్చి 15 : ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లికి చెందిన సభావట్ వాల్యా 2024 డిసెంబర్‌లో తన ఇంటి ముందు బైక్ పార్క్ చేయగా రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఈ మేరకు వాల్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తుండగా హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌కు చెందిన హజీ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. శనివారం మెజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టి, ఆయన ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించామని ఎస్సై వెంకటేశ్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ
- కేసారం, సిరిపురం గ్రామాల్లో పోరుబాట

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

వికారాబాద్/మర్పల్లి, మార్చి 15 : ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఎన్నికల హామీల్లో భాగంగా ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు నెరవేర్చుతుందని సీసీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం జిల్లాలోని మోమిన్‌పేట మండలంలోని కేసారం గ్రామంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. మర్పల్లి మండలంలోని సిరిపురం గ్రామంలో ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వికారాబాద్‌లోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ.. మార్చి 1 నుంచి మార్చి చివరి వరకు రాష్ట్రవ్యాప్తంగా సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమం నిర్వహించి ప్రజా సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు. కేసారం గ్రామంలో పర్యవేక్షించి ప్రజా సమస్యలు తెలుసుకునే క్రమంలో గ్రామంలోని దాదాపు 600 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు లేవని, కాంగ్రెస్ ప్రభుత్వం వారికి ఇళ్ల స్థలాలతోపాటు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు సాగు చేస్తున్న భూమికి పట్టాలు ఇవ్వాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ బీసీలకు బడ్జెట్లో అధిక నిధులు కేటాయించాలని, విద్య, వైద్యానికి 20 శాతం బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించకపోతే ధర్నాలు నిరాహార దీక్షలు, ప్రభుత్వ కార్యాలయాల ముట్టడి చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

వంద శాతం రుణమాఫీ చేయాలి

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ 50 శాతం రైతులకే చేసిందని, వెంటనే 100 శాతం రుణమాఫీ చేయాలని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. మర్పల్లి మండలంలోని సిరిపురం గ్రామాన్ని ఆయన సందర్శించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ పథకాలపై ఆరా తీశారు. పేదలకు ఇండ్ల స్థలాలతోపాటు ఇండ్లు కట్టించాలని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు జనాభా ప్రాతిపదికన పెంచాలన్నారు. అసెంబ్లీలో బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్, జిల్లా ఇన్‌చార్జి వెంకట్రాములు, వ్యవసాయ సంఘం అధ్యక్షుడు వెంకటయ్య, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనూనాయక్, జిల్లా కార్యదర్శి మహిపాల్, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అడ్వాన్స్ సాంకేతిక నైపుణ్యం అవసరం

మొయినాబాద్‌లోని రెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంఈవో వెంకటయ్య

మొయినాబాద్, మార్చి15 : ప్రస్తుతం సాంకేతిక రంగంలో ప్రపంచం పరుగులు పెడుతున్న తరుణంలో విద్యార్థులకు అడ్వాన్స్ సాంకేతిక నైపుణ్యం చాలా అవసరమని ఎంఈవో వెంకటయ్య అన్నారు. రంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ)పై అవగాహన కల్పించేందుకు 9 పాఠశాలలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో భాగంగా శనివారం ఏఐపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణ పాఠ్యాంశాల బోధనతో పాటు విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం చాలా అవసరయని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ నోడల్ అధికారి మల్లయ్య, పెద్దమంగళారం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రఘునాథ్, రెడ్డిపల్లి పాఠశాల ప్రధానోపధ్యాయుడు బాలయ్య, ఎస్‌టీఎస్ మండల అధ్యక్షుడు సుధాకర్, మాజీ ఎంపీటీసీ మోర శ్రీనివాస్, ఉపాధ్యాయులు బాలరాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలి

గట్టుఇప్పలపల్లిలో చేపట్టిన నిరాహార దీక్షలో పాల్గొన్న జేఏసీ నాయకులు

కడ్తాల్, మార్చి 15 : అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలంగా చేస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకోవాలని మండల సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. తలకొండపల్లి మండలంలోని గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ... జేఏసీ నాయకులు, గ్రామస్థులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం చేపట్టిన దీక్షలో వివిధ తండాలకు చెందిన గిరిజన, యువజన సంఘాల నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేస్తామన్న హామీని కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని విమర్శించారు. మండల ఏర్పాటు విషయంలో కాంగ్రెస్ నాయకులు ద్వంద వైఖరిని ప్రదర్శిస్తూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎన్ఆర్ఈజీఎస్ ప్రజా వేదిక

బంట్వారం, మార్చి 15 : మండలంలోని 11 జీపీలవారీగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై సోమవారం ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఏపీవో సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రంచాయతీల పరిధిలో ఏప్రిల్ 1, 2023 నుంచి 31 మార్చి 2024 వరకు చేపట్టిన పనులకు సంబంధించిన వాటిపై ఇప్పటికే గ్రామాలవారీగా సభలు నిర్వహించారన్నారు. వాటిని సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజా వేదిక నిర్వహించి, వివరాలు తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు, కూలీలు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

రోడ్డుపై మురుగు.. పరుగు

- దుర్వాసన వెదజల్లుతున్న పరిసరాలు
- ఇబ్బందుల్లో స్థానికులు

మొయినాబాద్‌లోలో అమీర్‌గూడకు వెళ్లే దారిలో రోడ్డుపై పారుతున్న మురుగు

మొయినాబాద్, మార్చి 15 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెనక భాగంలో ఉన్న కాలనీలోని డ్రైనేజీలోని మురుగును ప్రధాన రోడ్డు మీదకి వదిలారు. రోడ్డుపై మురుగు పారుతుండడంతో దుర్వాసన వెదజల్లుతున్నది. సమీప విజయనగర్ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మొయినాబాద్‌లోని ప్రభుత్వ దవాఖాన వెనుక కాలనీలో నుంచి వదిలిన మురుగు నీరు